క్లుప్తంగా

అభివృద్ధిని చూసి ఓర్వలేక అబద్ధాలు

దుద్యాల్: మండలంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్ మండిపడ్డారు. సోమవారం మండలంలోని లగచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుదురుమల్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరూ బీఆర్‌ఎస్‌లో చేరలేదని స్పష్టం చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి తట్టుకోలేక అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు రాని వారు అధైర్య పడొద్దని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు యాదవరెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, రఘుపతి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు



కొడంగల్: పట్టణ శివారులో చేపట్టిన అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఇవి చివరి దశకు చేరుకున్నాయని నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రయాదవ్, పి.శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతిగౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తెస్తామని స్పష్టంచేశారు. దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షల కోసం వరుసకట్టిన మున్సిపల్ కార్మికులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు సోమవారం ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందికి బీపీ, షుగర్, హెల్త్ చెకప్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా ఔషధాలను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ మాట్లాడుతూ.. కార్మిక సిబ్బంది పట్టణ స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అలాంటి వారు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు బుష్రాఫాతిమా, అమృత, మహేందర్, హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని వినతి

తాండూరు రూరల్: తన ఇంటిపన్నును తగ్గించాలని ఓ యువకుడు డీపీఓకు వినతిపత్రం అందజేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కా ర్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు విన్నవించారు. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని అంతారం గ్రామా నికి చెందిన విజయేందర్ పంచాయతీ అధికారులు తన ఇంటికి అధిక పన్ను వేశారని ఫిర్యా దులో పేర్కొన్నారు. వెంటనే డీపీఓ తాండూరు మండల అధికారులకు ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో ఉన్న రికార్డుల ప్రకారమే ఇంటి పన్ను వేశా మని పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణరెడ్డి తెలిపారు.

సంకిరెడ్డిపల్లిలో బోరు ఏర్పాటు

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లిలో సోమవారం డీఎంఎఫ్‌టీ నిధులతో గ్రామ శివారులో మిషన్ భగీరథ ఏఈ ప్రణీత్ ఆధ్వర్యంలో బోరును తవ్వించారు. నీళ్లు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గతంలో గ్రామస్తులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు నూతనంగా బోరు వేసి ట్యాంక్‌కు పైప్‌లైన్ అనుసంధానం చేయనున్నారని కాంగ్రెస్ నేతలు జగదీష్, చరణ్‌సింగ్ తెలిపారు.

కరాటే టోర్నీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్: సౌత్ ఇండియా నేషల్ కరాటే టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 12న పట్టణంలో కరాటే టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు పాల్గొన్నారు.

సర్కారు బడి పిలుస్తోంది

ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పెరిగాయి. వసతుల కల్పన, విద్యాబోధన తదితర అంశాలను వివరిస్తూ ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య దొరుకుతుందని వివరిస్తున్నారు.

- గ్రామాల్లో విస్తృతంగా బడిబాట ప్రచారం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సౌకర్యాలపై అవగాహన



దౌల్తాబాద్‌లో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: డిజిటల్ తరగతులు, డెస్క్ బెంచీలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఆంగ్ల మాధ్యమంలో బోధన, అనుభవం గల ఉపాధ్యాయులు ఇవన్నీ ఎక్కడో కాదు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు. వీటిపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అడ్మిషన్లు పెంచేందుకు విద్యాశాఖ కృషి చేస్తుంది. అంతేకాకుండా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపట్టి ప్రభుత్వ బడుల్లో వసతులపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. దౌల్తాబాద్ మండలంలో 45 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నారు. సుశిక్షితులపైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో కూడా బోధన అందుతుంది. మారుతున్న అభ్యసన విధానాలకు అనుగుణంగా గురువులకు సైతం ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది.

పరిశోధనలకు అవకాశం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరిశోధనల్లో పాల్గొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. ఇన్‌స్పైర్ అవార్డుల పథకం ద్వారా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తుంది. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ఇస్తుంది. దీంతో శాస్త్ర సాంకేతిక వైపు చిన్నారుల అడుగులు పడనున్నాయి.

మధ్యాహ్న భోజనం, యూనిఫాం

పేద విద్యార్థులు రోజూ బడికి వచ్చేలా ప్రభుత్వం అన్ని సర్కారు బడుల్లో సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజనం అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే బాధ తప్పింది. అలాగే 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుంది. పాఠశాల నుంచి ఇంటికి మూడు కిలోమీటర్లు పైగా దూరం నుంచి ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోతే 6, 7, 8 తరగతుల విద్యార్థులకు నెలకు రూ.250 చొప్పున ప్రభుత్వం రవాణా భత్యం చెల్లిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తుంది. ఇవేకాక మరెన్నో వసతుల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

> **నాణ్యమైన బోధనకు కృషి**
>
> ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. విద్యార్థులకు అందించేందుకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, సైతం ఇప్పటికే ఆయా పాఠశాలలకు తరలించాం. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నాం.
>
> – వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

నిధులు లేక నిత్యం అవస్థలు

గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆవేదన



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శుల సంఘం నాయకులు

కుల్కచర్ల: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో తాము తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని చౌడాపూర్ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చౌడాపూర్ మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ సోమలింగంకు వినతిపత్రం అందించారు. 11వ తేదీ నుంచి గ్రామపంచాయతీ పరిధిలో ఆర్థిక పరమైన విధులను నిర్వహించలేమని, తాము వ్యక్తిగతంగా అప్పులు చేసి గ్రామంలో పనులు చేస్తున్నామని తెలిపారు. నిధులు లేకపోవడంతో ప్రజలకు సరైన సమాధానం ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల విధులను సర్వీసుగా పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ రాజిరెడ్డి, సూపరింటెండెంట్ రమేష్, కార్యదర్శులు సురేందర్, రాధ, స్వరూప, రఘురెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మహేశ్, శ్రీను, రేణుక, పరమేశ్వరి, చందు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

కుల్కచర్ల: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని చెల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజల కలలను సాకారం చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మండల పరిధిలో అర్హులైన ప్రజలందరికీ ఇళ్లను అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య, నాయకులు పార్వతయ్య, అంబు తదితరులు పాల్గొన్నారు.



చెల్లాపూర్‌లో ప్రొసీడింగ్ అందజేసి, పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

నెలాఖరు వరకు రేషన్

జిల్లాలో 588 దుకాణాలు

- 8,97,270 మంది లబ్ధిదారులు
- 16,518 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ



రేషన్ దుకాణం దగ్గర ఏర్పాటు చేసిన బ్యానర్

కొడంగల్: వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా జూన్‌లో వినియోగదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఉచితంగా అందజేయాలని అధికారులు ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 588 రేషన్ దుకాణాల ద్వారా మూడు నెలలకు సంబంధించి 16,518 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని రేషన్ షాపులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 8,97,270 మంది సన్న బియ్యం వినియోగదారులు ఉన్నారని అధికారులు తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ దుకాణాల ద్వారా ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా ఇస్తున్నారు. బయో మెట్రిక్ ద్వారా పంపిణీ చేస్తున్నారు.

ఎగబడుతున్న జనాలు

కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో 90 రేషన్ దుకాణాల పరిధిలో 38,395 రేషన్ కార్డులు, 1,46,700 మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ–పాస్) యంత్రాల ద్వారా బియ్యాన్ని అందిస్తున్నారు. రేషన్ డీలర్లు జూన్ నెలలో 30 రోజుల పాటు దుకాణాన్ని తెరిచి ఉంచాలన్నారు. డీలర్లు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అలాగే రేషన్ తీసుకోవడానికి ప్రజలు ఎగబడుతున్నారు.



లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

కేంద్రం వాటానే అధికం

కుల్కచర్ల: నిరుపేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వ వాటానే అధికమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘణపూర్ వెంకటయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఘణపూర్‌లో రేషన్ దుకాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇబ్బందులు రాకుండా మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని అందించాలని నిర్ణయించిందన్నారు. లబ్ధిదారులు అందించే బియ్యంలో రాష్ట్ర వాటా నామమాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మిగోపాల్, రేషన్‌డీలర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా బడిబాట

పలు చోట్ల యూనిఫాం పంపిణీ

పరిగి/పూడూరు/కుల్కచర్ల/దుద్యాల్/మోమిన్‌పేట్/దోమ: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆయా ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నిర్వహించారు. ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి తదితర సదుపాయాలు కల్పిస్తున్నారని వివరించారు. పిల్లలని సర్కారు బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కుల్కచర్లలోని పీరంపల్లిలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. మోమిన్‌పేటలో దుస్తులను ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీఓ విజయలక్ష్మి పంపిణీ చేశారు. పూడూరులోని గొంగుపల్లిలో ఏకరూప దుస్తులను ఎంపీడీఓ పాండు పరిశీలించారు.



పూడూరులో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కుల్కచర్ల: పీరంపల్లిలో దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



పరిగి: మిట్టకోడూర్‌లో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు



మోమిన్‌పేటలో విద్యార్థుల దుస్తులను ఉపాధ్యాయులకు అందిస్తున్న ఎంపీడీఓ



దుద్యాల్: అల్లిఖాన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం



దోమ: బొంపల్లిలో బడిబాట ర్యాలీలో తహసీల్దార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ప్రతిభచాటిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

బొంరాస్‌పేట: పాఠశాల విద్యతోనే చిన్నారుల భవితకు పునాది పడుతుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి చెప్పారు. సోమవారం మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓ హరిలాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చౌదర్‌పల్లి, రేగడిమైలారం, ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలల్లోని టాపర్లుగా నిలిచిన 16 మంది విద్యార్థులకు సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యను మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలుగౌడ్ అన్నారు. కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, నాయకులు చంద్రశేఖర్, గోపాల్, విజయలక్ష్మి, లక్ష్మి, అనిల్‌కుమార్, వెంకటేశ్, నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగ్జీవని, వారి తల్లిదండ్రులను సన్మానిస్తున్న నాయకులు

కఠోర శ్రమ చేయాలి

విద్యార్థి దశ నుంచే ఉజ్వల భవిష్యత్‌ను తీర్చి దిద్దుకునేందుకు కఠోర శ్రమ చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక(టీవీవీ) రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని రేగడిమైలారానికి చెందిన జగ్జీవని యూజీలో అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం బెంగళూరులో ప్రవేశం సాధించడం పట్ల టీవీవీ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.8వేల నగదు అందించారు. ఫ్రీ సీటు సాధించినందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి, తదితర నాయకులు ఆమెను కీర్తించారు.

బస్సుపాస్ చార్జీలను తగ్గించాలి

తాండూరు రూరల్: బస్సు పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్ తాండూరు మండల అధ్యక్షుడు సిరిగిరిపేట్ వీరేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్సు పాస్ చార్జీలు పెంచడంపై గ్రామీణ ప్రాంతాంలోని పేద విద్యార్థులు ఎంతగానో ఇబ్బందులు పడతారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్‌ల కోసం ధర్నా

చేవెళ్ల: పట్టణంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల ఎదుట ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్ కోసం సోమవారం డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, పీజీలు పూర్తి చేసుకున్న డాక్టర్లకు ఏడాది పాటు అందించే వైద్యసేవలకు గాను ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్‌లను అన్ని కళాశాలలు అందిస్తాయన్నారు. గత ఏడు నెలలుగా ఈ స్కాలర్‌షిప్‌లు రావటం లేదన్నారు. యాజమాన్యాన్ని ఎన్నిసార్లు అడిగినా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తూ వస్తోందన్నారు. యాజామాన్యం వెంటనే స్పందించి ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్‌లను అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున అందోళనలు చేస్తామన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి

ఏడీఏ రుద్రమూర్తి



వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఏడీఏ రుద్రమూర్తి

తాండూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని తాండూరు డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ రుద్రమూర్తి సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు మండలాల వ్యవసాయశాఖ ఏవో, ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. అధికారులు కార్యాలయాల్లో కాకుండా రైతుల పొలాల్లోకి వెళ్లాలన్నారు. ఎప్పటికప్పుడు రైతులతో మాట్లాడి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ నెల 20వ తేదీ తర్వాత రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ డబ్బులు జమ అవుతాయన్నారు. ఇంకా ఎవరైనా ఈకేవైసీ చేసుకొని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవోలు కొమరయ్య, పవన్ ప్రీతం, శ్వేతరాణి, అనితలతో పాటు ఏఈవోలు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్

నందిగామ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ శివారులో ఈదుల ఎల్లమ్మ ఆలయ ఆవరణలో సోమవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ అధ్యక్షతన మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి బీజేపీ కార్యకర్త మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. రాబోయే యోగా దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాలని, దీన్ దయాల్ బలిదాన్ దివాస్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం తల్లికి వందనం పేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌గౌడ్, నర్సింహాగౌడ్, కృష్ణ మోహన్, అశోక్, మల్లేశ్, సాగర్, శ్రీశైలం, రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.